సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో మనుగడ ప్రశ్నార్థకం



స్టీల్ సిటీ డిపో బస్ గ్యారేజీ

స్టీల్ సిటీ డిపో ప్రాంగణం

స్టీల్ సిటీ డిపో

- ముగిసిన లీజు గడువు
- స్థలం ఖాళీ చేయాలని స్టీల్‌ప్లాంట్ డిమాండ్
- ఏడు నెలలుగా చర్చలు విఫలం
- 350 మంది సిబ్బంది ఆందోళన

ఉక్కునగరం: కూర్మన్నపాలెం వద్ద ఉన్న ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో మనుగడ ఇప్పుడు ప్రమాదంలో పడింది. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం డిపో స్థలాన్ని ఖాళీ చేయాలని లేదా మార్కెట్ ధర ప్రకారం భారీ లీజు చెల్లించాలని డిమాండ్ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గతంలో నామమాత్రపు లీజుతో కొనసాగిన డిపో ఇప్పుడు మూతపడే పరిస్థితికి చేరడంతో దాదాపు 350 మంది సిబ్బంది భవితవ్యంపై ఆందోళన నెలకొంది.

ఏం జరిగింది?

1991లో ఆర్టీసీ అభ్యర్థన మేరకు స్టీల్‌ప్లాంట్ కూర్మన్నపాలెంలో జాతీయ రహదారిని ఆనుకుని 8 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. నామమాత్రపు లీజుతో 33 ఏళ్ల పాటు ఈ ఒప్పందం కుదిరింది. 2024 జనవరి 26న ఈ ఒప్పందం గడువు ముగిసింది. దీంతో స్టీల్‌ప్లాంట్ అధికారులు డిపో స్థలాన్ని ఖాళీ చేయాలని ఆర్టీసీకి నోటీసు ఇచ్చారు. గతంలో మాదిరిగా నామమాత్రపు లీజుతో మరో 33 ఏళ్లు పొడిగించాలని అభ్యర్థిస్తూ ఆర్టీసీ వైస్ చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ స్టీల్‌ప్లాంట్‌కు లేఖ రాశారు. అయితే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం రూ.133 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా, ఏడాదికి రూ.5.06 కోట్లు అద్దెగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీకి నోటీసులు పంపింది. ఏడు నెలలుగా ఇరు సంస్థల మధ్య చర్చలు జరుగుతున్నా ఎలాంటి పరిష్కారం లభించకపోవడంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు డిపోను తరలించాలని నిర్ణయించారు.

కార్మికుల ఆందోళన

డిపో తరలింపు నిర్ణయంపై ఆర్టీసీ కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో స్థిరపడిన కార్మికులు తమ ఇళ్లు, పిల్లల చదువుల గురించి భయపడుతున్నారు. ఉన్నతాధికారుల స్థాయిలో పరిష్కారం లభించక పోవడంతో రాజకీయ నిర్ణయం తీసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని వారు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల నాయకులు గాజువాక ఎమ్మెల్యేను కలిసి ఈ విషయం తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, అగనంపూడి టోల్‌గేట్ సమీపంలో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చినట్లు కార్మిక నాయకులు తెలిపారు. అయితే కేవలం స్థలం మాత్రమే ఇస్తే డిపో నిర్మాణం ఎలా సాధ్యమవుతుం దని ఆర్టీసీ ప్రాంతీయ యాజమాన్యం ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.ఈ మొత్తం వ్యవహారం ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేతుల్లో ఉంది. ప్రజల రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి

83 బస్సులు.. 350 మంది సిబ్బంది

ప్రస్తుతం కూర్మన్నపాలెం డిపోలో 83 బస్సులు, సుమారు 350 మంది సిబ్బంది ఉన్నారు. నవంబర్ 30 నాటికి డిపోను పూర్తిగా తొలగించడానికి గడువు ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు స్టీల్‌ప్లాంట్‌ను కోరారు. బస్సులను, సిబ్బందిని ఇతర డిపోలకు బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 600 నంబర్ బస్సులు అనకాపల్లి డిపోనకు, 400 నంబర్ బస్సులు.. గాజువాక డిపోనకు, 38 నంబర్ బస్సులు మద్దిలపాలెం డిపోనకు తరలించనున్నారు.

డిపోను అక్కడే ఉంచాలి...



ప్రజలందరికీ అందుబాటులో ఉన్న డిపోను తరలించడం సరికాదు. ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని ఒప్పించి అక్కడే డిపోను కొనసాగించాలి. లేనిపక్షంలో ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు టోల్ గేటు వద్ద ఇచ్చే స్థలంలో ప్రభుత్వం డిపోను నిర్మించాలి.

– కె. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్

కరాటేలో గాజువాక చిన్నారి ప్రతిభ



కాంస్య పతక గ్రహీత పునీత శాస్వి

గాజువాక : ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన ఆలిండియా ఇండిపెండెన్స్ కప్ కరాటే చాంపియన్‌షిప్‌లో స్థానిక టింపనీ స్కూల్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థి పి.పునీత శాస్వి ప్రతిభ ప్రదర్శించింది. షీలానగర్‌కు చెందిన మహీరా షోటోకాన్ కరాటే డో ఇండియా శిక్షణా సంస్థ నుంచి పోటీలకు హాజరైన ఆమె కాంస్య పతకం సాధించి పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా చిన్నారితోపాటు కోచ్‌లు కె.మనోజ్‌కుమార్, కె.అరుణ్ కుమార్‌లను స్థానికులు అభినందించారు.

శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

గాజువాక : శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఈనెల 19 నుంచి 26 వరకు వివిధ పోటీలను నిర్వహించనున్నట్టు ఆ సంస్థ డీజీఎం కె.బంగార్రాజు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకర్రావు జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఈ పోటీలను నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆష్టోఫేర్, పాటలు, శ్లోక పారాయణం, గాజు పెయింటింగ్, ఇమాజినరీ స్టోరీ టెల్లింగ్, రోల్ ప్లే, డ్రాయింగ్ తదితర అంశాలపై ఈ పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ఈనెల 18లోగా ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విజేతలకు సెప్టెంబర్ 1న బహుమతులను అందజేస్తామన్నారు. వివరాల కోసం 9963582130, 91210 05933 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ముత్యమాంబ అమ్మవారికి వెండి పాదాల బహూకరణ



ముత్యమాంబ అమ్మవారికి వెండి పాదాలు బహూకరిస్తున్న కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, వెంకట రమణారెడ్డి దంపతులు గురువారం సీతానగరంలోని ముత్యమాంబ అమ్మవారికి వెండి పాదాలను బహూకరించారు. ఈ సందర్భంగా వారు ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వెండి పాదాలను సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దంపతులను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు పాల్గొన్నారు.

87వ వార్డులో 'స్వచ్ఛతా హీ సేవ'



పార్కులో శుభ్రం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది, తిరుమలనగర్ వాసులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని తిరుమలనగర్, ఏపీజే అబ్దుల్‌కలాం చిల్డ్రన్స్ పార్కులో గురువారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులోని పొదలు, చెత్తాచెదారాన్ని తొలగించి, కంపోస్టును శుభ్రం చేశారు. ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను కూడా తొలగించారు. ముఖ్యంగా వాకింగ్ ట్రాక్‌పై మొలిచిన పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించి పార్కును ఆహ్లాదకరంగా మార్చారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సచివాలయ సిబ్బంది, అలాగే తిరుమలనగర్ నివాసితులు అప్పలనాయుడు, పరమానందం, సన్యాసిరావు, గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోవును కాపాడిన సత్యసాయి బృందం



సంప్‌లో పడిపోయిన గోవు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని సత్యసాయి సేవా సమితి బృందం తమ మానవత్వాన్ని చాటుకుంది. గురువారం ఉదయం సెక్టార్-1 కేంద్రీయ విద్యాలయం ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ఓపెన్ సంప్‌లో ఒక గర్భిణీ ఆవు పడిపోయింది. బయటకు రాలేక ఆవు ఆర్తనాదాలు చేస్తుండగా, అటుగా వెళ్తున్న సత్యసాయి సేవా సమితి జాయింట్ సర్వీస్ కోఆర్డినేటర్ రామచంద్రరావు దానిని గుర్తించారు. వెంటనే స్పందించిన ఆయన స్టీల్ ప్లాంట్‌కు చెందిన ఇతర సత్యసాయి భక్తులను పిలిచి, తాడు, పైపుల సహాయంతో ఆవును సురక్షితంగా బయటకు తీశారు. ఆ తర్వాత సత్యసాయి పాలెం నివాసి, వెటర్నరీ డాక్టర్ చిరంజీవిని రప్పించి గోవుకు ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ఒక ఓపెన్ వ్యాన్‌ను ఏర్పాటు చేసి యజమాని వద్దకు తరలించారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడు ఆనంద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో పాత నేరస్తుడైన చేపల ఆనంద్‌ను స్టీల్‌ప్లాంట్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... ఈ నెల 2న టౌన్‌షిప్‌లోని సెక్టార్-12లో తన ఇంటి ముందు వాకింగ్ చేస్తున్న కుర్ర ఉమాదేవి అనే మహిళ మెడలోంచి నిందితుడు గొలుసు లాక్కొని పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గాజువాక, దువ్వాడ, న్యూపోర్ట్, రాంబిల్లి పోలీస్ స్టేషన్లలో పలు కేసుల్లో నిందితుడైన అజీమాబాద్ నివాసి చేపల ఆనంద్‌ను గంగవరం కూడలి వద్ద గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా క్రైమ్ సీఐ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఒంటరిగా నడిచేటప్పుడు లేదా ప్రయాణించేటప్పుడు మహిళలు తమ నగలు విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మార్కెట్‌కు మువ్వన్నెల కళ



జాతీయ జెండాలు కొనుగోలు చేసున్న వినియోగదారులు,



రిస్ట్‌బ్యాండ్లు, హెడ్ బ్యాండ్లు

పెదగంట్యాడ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో త్రివర్ణ పతాకాలు, ఇతర సామాగ్రితో వ్యాపారాలు కళకళలాడుతున్నాయి. కొన్ని దుకాణాలు పూర్తిగా జాతీయ జెండాలు, ఇతర అలంకార సామాగ్రితో నిండిపోయాయి. పాఠశాలలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల్లో జెండాలను ఎగురవేయడానికి ఆయా సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు జెండాలు, ఇతర అలంకార సామాగ్రి కొనుగోలు చేయడానికి వస్తుండటంతో దుకాణాలు సందడిగా మారాయి. కాటన్ (ఖాదీ) జెండాలు వాటి పరిమాణాన్ని బట్టి రూ. 100 నుంచి రూ. 500 వరకు లభిస్తున్నాయి. పాలిస్టర్ జెండాలు రూ. 50 నుంచి రూ. 200 లోపు ఉన్నాయి. పిల్లల కోసం చిన్న జెండాలు, టోపీలు, టీ-షర్టులు, రిస్ట్ బ్యాండ్లు, హెడ్ బ్యాండ్లు వంటివి కూడా విక్రయిస్తున్నారు. వ్యాపారం జోరుగా సాగుతుండటంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి



ఉక్కు అడ్మిన్ వద్ద సంతకాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్టీల్ సీఐటీయు గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లపై గురువారం ఉక్కు అడ్మిన్ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు చెల్లించాల్సిన 330 శాతం బకాయి వేతనం మరియు పూర్తి జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఉక్కు సహాయ మంత్రి ప్యాకేజీలో కార్మికుల జీతాలు కూడా ఉన్నాయని ప్రకటించినప్పటికీ, యాజమాన్యం పూర్తి జీతాలను చెల్లించడంలో విఫలమైందని ఆరోపించారు. బీఎఫ్-3 ఉత్పత్తి ప్రారంభించి పూర్తి ఉత్పత్తిని సాధించగానే పూర్తి జీతాలు చెల్లిస్తామని యాజమాన్యం గతంలో హామీ ఇచ్చినా, దానిపై దృష్టి పెట్టడం లేదని అయోధ్యరామ్ పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ, లేబర్ ఎదుట అంగీకరించిన హెచ్‌ఆర్‌ఏ ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వై.టి. దాస్‌తో పాటు పి. శ్రీనివాసరాజు, తౌడన్న, అప్పలరాజు, శ్రీనివాసరెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: ఇటీవల స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తొలగించిన 1,541 మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మే 20 నుంచి మే 29 వరకు కార్మికులు తమ ఉద్యోగాల రక్షణ కోసం సమ్మె చేశారని, అయితే యాజమాన్యం కక్షపూరితంగా సమ్మెలో పాల్గొన్నారనే నెపంతో 1,541 మంది కార్మికుల గేట్ పాస్‌లను రద్దు చేసి, వారిని విధుల్లోకి రానివ్వడం లేదని గంగరావు ఆరోపించారు. అంతేకాకుండా వారి స్థానంలో కొత్తవారిని విధుల్లోకి తీసుకుంటున్నారని తెలిపారు. ఆర్.ఎల్.సి. సమక్షంలో జరిగిన చర్చల్లో ఎవరినీ తొలగించబోమని యాజమాన్యం హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీని ఉల్లంఘించిందన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా యాజమాన్యాన్ని ఆదేశించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాధా కృష్ణులు, గోపికల వేషధారణలో అలరించారు. రేపల్లె వేణుగానాలు, బృందావన అందాలు, ఉట్టి సంబరాలతో రవీంద్ర భారతి విద్యార్థులు సందడి చేశారు. - గాజువాక

సెమీ కండక్టర్ రంగంలో నైపుణ్యం అవసరం

అగనంపూడి: సెమీ కండక్టర్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోందని, వీఎల్ఎస్ఐ విభాగంలో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయని అభ్యాస సెమీ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ విశ్వేశ్వరరావు అన్నారు. దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో వీఎల్ఎస్ఐ డిజైనింగ్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ రంగంలో అనుభవం, పరిజ్ఞానం ఉన్న ఇంజినీర్లకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. గ్లోబల్ స్థాయిలో రాణించాలంటే ప్రాథమిక సూత్రాలను అర్థం చేసుకొని, వాటిని ఆచరణలో పెట్టే నైపుణ్యాలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అలా చేసినప్పుడే మంచి గుర్తింపుతో పాటు, భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె. సుధాకర్, రెక్టార్ వి. మధుసూదనరావు, ఈసీఈ విభాగాధిపతి దేవన్న తదితరులు పాల్గొన్నారు.

నడుపూరులో భారీ జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న నడుపూరు పాఠశాల విద్యార్థులు

పెదగంట్యాడ: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నడుపూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కిల్లాన ముసలయ్య, మండల అధ్యక్షురాలు వరలక్ష్మి సహకారంతో రూపొందించిన 900 అడుగుల జాతీయ జెండాను ఈ ర్యాలీలో ప్రదర్శించారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, యువతతో కలిసి డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, కరణంరెడ్డి నరసింగరావు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. సుమారు 2 కిలోమీటర్ల మేర సాగిన ఈ ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనల వల్ల ప్రజల్లో జాతీయ సమైక్యతా భావం పెరుగుతుందని పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి. అమల, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ



హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సహకారంతో నిర్వహించనున్న అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ (ఏక్యూవీహెచ్) 2025లో భాగంగా నిర్వహించే విశ్వవిద్యాలయ స్థాయి పోటీల పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌ను సెప్టెంబర్ 13న నిర్వహించనుంది. ఇందుకు సన్నాహకంగా విశ్వవిద్యాలయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఏయూ పరిధిలోని కళాశాల విద్యార్థులకు ఆగస్టు 28న హ్యాకథాన్ నిర్వహిస్తారు. విశ్వవిద్యాలయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో హ్యాకథాన్ కన్వీనర్ ఆచార్య డి.లలిత భాస్కరి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకట్రావు, ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు, డీన్ ఆచార్య కె.రమాసుధ పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ అందించడంపై హర్షం



బీచ్‌రోడ్డులో ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

ఏయూ క్యాంపస్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ అందించడంపై కృతజ్ఞతలు తెలుపుతూ స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్‌కే బీచ్ నుంచి విక్టరీ ఎట్ సీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఎంపీ శ్రీభరత్, నేషనల్ ఆఫీసర్స్ అధ్యక్షులను సత్కరించారు. హయ్యర్ పెన్షన్ అందని వారికి సైతం లభించే విధంగా కృషి చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రరావు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఏటీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, బోసు బాబు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



అగనంపూడిలో తిరంగా ర్యాలీ

అగనంపూడి : అగనంపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కమిటీ ఆధ్వర్యంలో గురువారం 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది జాతీయ జెండాలను చేతబూని అగనంపూడి పరిసర ప్రాంతాల్లో ప్రదర్శన నిర్వహించారు. ఆసుపత్రి డైరెక్టర్ దాసరి త్రినాథరావు, అగనంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.







